క్లుప్తంగా

పనులు వేగవంతం చేయాలి



మాయలూరులో పనులను పరిశీలిస్తున్న డీఈ

ఉయ్యాలవాడ : 'నాడు–నేడు' కింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆ శాఖ డీఈ జోగప్ప సూచించారు. సోమవారం మండలంలోని మాయలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.30 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులను నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో జరుగుతున్న నాడు– నేడు పనుల్లో పురోగతి పెంచేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రభాకర్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుదర్శనరావు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): ఈనెల 22వ తేదీన రాజమండ్రి నన్నయ యూనివర్సిటీలో జరిగే యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. సోమవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల పరిరక్షణ కోసం జరుగుతున్న సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సిసింద్రీ, శివశంకర్, నాయకులు సతీష్, రమణ, శంకర్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న ప్రసాద్

నంద్యాల(అర్బన్): ఆటోనగర్‌లోని మెకానిక్‌లకు కేటాయించిన స్థలాల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలాలను కొందరు అక్రమంగా అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి అర్హులైన మెకానిక్‌లకు స్థలాలు అందేలా చూడాలన్నారు. శ్రీనివాసులు, హుసేన్‌సా, ఇబ్రహీంబాషా, ఇమాంసా పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం



అహోబిలంలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ఆళ్లగడ్డ: త్వరలో జరగనున్న అహోబిలం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎగువ అహోబిలంలోని కారంజ వద్ద సోమవారం ఎన్‌సీసీ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ గంగన్న మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా ఉన్న చిన్న చిన్న చెట్లు, రాళ్ల తదితర వాటిని తొలగించామని, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో జేసీబీతో పెద్ద బండరాళ్లను తీసివేసినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



ఉయ్యాలవాడలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ రవికుమార్ సోమవారం పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మహమ్మద్ రఫిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మార్చి 13న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలు జరగనున్నాయన్నారు. మండలంలో 699 మంది ఓటర్లుండగా పట్టభద్రులు 676, ఉపాధ్యాయులు 23 మంది ఉన్నారని చెప్పారు. వీరి కోసం పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ రవిప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ దస్తగిరి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల కోసం చాగలమర్రిలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. పట్టభద్రులు 1477, ఉపాధ్యాయ ఓటర్లు 114 మంది ఉన్నట్లు చెప్పారు. స్థానిక బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఇంతలోనే ఎంత మార్పు



నాపేరు తలారి రాములమ్మ. నేను ఉయ్యాలవాడలో నివాసం ఉంటున్నా. నాకు ఈ సంవత్సరమే వితంతు పింఛన్‌ను అధికారులు మంజూరు చేశారు. జనవరి నుంచి రూ.2750 అందుకుంటున్నా. పింఛన్ కోసం ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వలేదు. నా భర్త చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డులను వలంటీర్‌కు అందజేశాను. ఆతరువాత నెలకే నాకు పింఛన్ అందింది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.



నాపేరు దేవరాజు.. నేను క్రిష్టిపాడులో నివాసముంటున్నా. దివ్యాంగుడైన నేను గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగి పింఛన్‌ను పొందేవాడిని. అది కూడా ఎప్పుడు ఇస్తారో కచ్చితంగా తెలిసేది కాదు. ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లి సొమ్ము తీసుకోవడానికి ఎదురు చూసేది. ప్రస్తుతం మా వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి రూ.3వేలు దివ్యాంగుల పింఛన్‌ను అందజేస్తున్నారు.

"కులం చూడం..మతం చూడం.. వర్గాలను పట్టించుకోం..రాజకీయ పార్టీలు అంతకంటే చూడం.. కేవలం అర్హులని తేలితే చాలు మనందరి ప్రభుత్వంలో పథకాలు అందజేసేలా చర్యలు చేపట్టాం''.
– సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలన మధ్య తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే.. నియోజకవర్గంలో అప్పటి వరకు ఉన్న లబ్ధిదారుల సంఖ్యకు దాదాపు మరో పావు శాతం మంది పింఛన్‌కు అర్హత పొందడం.. పింఛన్ సొమ్ము కోసం రోజుల తరబడి నిరీక్షణలకు టాటా చెప్పి తెల్లవారక ముందే ఇంటికే వచ్చి ఒకటో తేదీనే సొమ్ము అందజేయడం.. నాడు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే మంజూరు చేయగా.. ప్రస్తుతం అర్హులని తేలితే చాలు అందజేస్తున్నారు. దీంతో ఇంతలోనే ఎంత మార్పు అంటూ లబ్ధిదారులు చర్చించుకుంటున్నారు.

- నాడు పింఛన్ కోసం పడిగాపులు.. నేడు ఇంటికెళ్లి అందజేత
- నియోజకవర్గంలో మొత్తం పింఛన్లు 38,317
- టీడీపీ దిగిపోయే నాటికి 26,826 మాత్రమే
- వైఎస్సార్‌సీపీ వచ్చాక అదనంగా 11,491 మందికి లబ్ధి
- ప్రస్తుతం ప్రతి నెలా రూ.11.14కోట్లు పంపిణీ
- టీడీపీ హయాంలో పంచింది రూ.5.36 కోట్లే
- గతంలో జన్మభూమి కమిటీ నిర్ణయం మేరకే మంజూరు
- నేడు అర్హతే ప్రామాణికం



రుద్రవరంలో పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు (ఫైల్)



ఈనెల 1వ తేదీన కిష్టిపాడులో సుజానమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వాతి

ప్రతి నెలా రూ.11.14 కోట్ల పంపిణీ

- ప్రతి నెలా ఒకటో తేదీన నియోజకవర్గంలోని పింఛన్‌దారులకు రూ. 11.14 కోట్లను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తున్నారు.
- టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ. 5.36 కోట్లను మాత్రమే ఇచ్చేవారు. అది కూడా లబ్ధిదారులు కార్యాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చేది.

ఆళ్లగడ్డ: నాయకులు.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదు. గత ప్రభుత్వంలో లాగా జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్లు పట్టుకోవాల్సిన ఖర్మ అంతకంటే లేదు. అర్హతే కొలమానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోంది. వలంటీర్లతో అర్హులను గుర్తించి పింఛన్ అందజేసి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అధికారంలోకి వచ్చిన మూడునరేళ్లలోనే 11,491 నూతన పింఛన్లను అందజేసి చిత్తశుద్ధి అంటే ఏంటో చేసి చూపింది.

పెరిగిన పింఛన్..

ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్‌దారులకు ఇస్తున్న నెలవారీ పింఛన్ రూ 2,000 నుంచి రూ.2,750 పెంచడంతో పాటు అనేక మంది అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, ఏభై ఏళ్ల పై బడిన ఎస్సీ, ఎస్టీలు, చేనేత , గీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పు వాయిద్య కళకారులు తదితరుల పింఛన్ దారులకు ఇళ్ల వద్దకే వెళ్లి నగదు అందజేస్తున్నారు. గతంలో ఎవరైనా చనిపోతే వారి స్థానంలో మరొకరికి పింఛన్‌ను ఇచ్చేవారు. ప్రస్తుతం అర్హతే మాత్రమే చూస్తున్నారు.

అర్హత ఉంటే పింఛన్ మంజూరు

అర్హతే ప్రామాణికంగా పింఛన్ అందజేస్తున్నాం. రాజకీయాలు, కులం,మతం వంటి వాటికి అతీతంగా వర్తింపజేస్తున్నాం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దరఖాస్తులు స్వీకరించి జనవరి, జూన్ నెలల్లో పింఛన్ అందజేస్తున్నాం.

–సుబ్బారెడ్డి, ఎంపీడీఓ, ఆళ్లగడ్డ

అర్హతే ప్రామాణికంగా ..

పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నియోజకర్గంలో కొత్త పింఛన్లను మంజూరు చేసింది. దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు ఆయా గ్రామ వలంటీర్ల ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులుగా గుర్తిస్తున్నారు. గతంలో జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికి మాత్రమే ఇచ్చేవారు. అది అర్హతా ఉన్నా లేకపోయినా సరే. కేవలం తమవారు అయితే చాలనేవారు. ఇక పింఛన్ సొమ్ము కోసం ప్రతి నెలా కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే అవస్థలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇళ్ల వద్దకే వెళ్లి నగదును అందజేసే నూతన ఒరవడిని తీసుకొచ్చింది.

మండలాల వారీగా వైఎస్సార్ పింఛన్ కానుక వివరాలు..

మండలం	వైఎస్సార్‌సీపీ వచ్చాక పింఛన్లు మంజూరు	టీడీపీ పాలన చివరి నాటికి పింఛన్ల సంఖ్య	మొత్తం
ఆళ్లగడ్డ	1,529	3,568	5,097
ఆళ్లగడ్డ రూరల్	1,524	3,558	5,082
చాగలమర్రి	1881	4,391	6272
దొర్నిపాడు	1,103	2,575	3,678
రుద్రవరం	1,881	4,392	6,273
శిరివెళ్ల	2,421	5,652	8,073
ఉయ్యాలవాడ	1,152	2,690	3,842
మొత్తం	11,491	26,826	38,317

అవగాహనతో వ్యవసాయం చేయాలి



మిత్ర, శత్రు పురుగుల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

దొర్నిపాడు: సాగు చేసే పంటపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు సూచించారు. డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా క్రిష్టిపాడు గ్రామంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మిత్ర, సాలీడు, గొల్లభామ, కందిరీగ, తూనీగ, అక్షింతల పురుగు తదితర వాటిని గుర్తించి సంరక్షించుకుంటే రసాయన మందుల పిచికారీ తగ్గించుకోవచ్చని చెప్పారు. అలాగే విచక్షణారహితంగా రసాయన మందుల వాడకం తగ్గించుకోవాలని కోరారు. మిరప, వరి, మొక్కజొన్న, శనగ, పత్తి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. పెట్టుబడులు తగ్గించుకునే విధానాలను అలవర్చుకోవాలన్నారు. సర్పంచ్ బుద్దారెడ్డిగారి శివరామిరెడ్డి, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, ఆలయ చైర్మన్ శంకర్‌రెడ్డి, వీఏఏ రంగారెడ్డి పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకొని రాయలసీమ ఎడారిగా మారకుండా చూడాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకులు రమణారెడ్డి, గోపాల్‌యాదవ్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం స్టీరింగ్ కమిటీ నాయకుడు నందకుమార్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ తుంగభద్ర నది నుంచి సీమకు రావాల్సిన నికర జలాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూనే తుంగభద్ర ఎగువ సమాంతర కాల్వ, ఆర్‌డీఎస్ తుది వరద కాల్వ, తుంగభద్ర దిగువ కాల్వల సంరక్షణ కోసం వేదావతి నదిపై ఎత్తిపోతల పథకం సాధించాలని కోరారు. రాయలసీమ రైతు పాదయాత్ర ఈనెల 28న ఆదోనిలో ప్రారంభం కానుందని, తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు ఈశ్వరరెడ్డి, కాశిరెడ్డి, నాగిరెడ్డి, కొండారెడ్డి, రామిరెడ్డి, కంబగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

ఉయ్యాలవాడ : మండలంలో ఉగాది నాటికి జగనన్న కాలనీల్లోని 62 గృహ ప్రవేశాలు జరగాలనేది లక్ష్యమని హౌసింగ్ ఏఈ నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అల్లూరు సచివాలయ పరిధిలో 8, బోడెమ్మనూరు 12, మాయలూరు 12, సుద్దమల్ల 14, తుడుమలదిన్నె 7,హరివరం 9 ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. లబ్ధిదారులు మార్చి 20వ తేదీ లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ స్పష్టం చేశారు.

మెరుగైన సేవలందించాలి

నంద్యాల(సిటీ): సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు సచివాయాలను అకస్మికంగా తనిఖీ చేశారు. 37వ వార్డు నందమూరి నగర్, 38వవార్డు వైఎస్సార్ నగర్ సచివాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. పనులు వసూలు చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా నరసింహారెడ్డి నియమితులయ్యారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా ఏర్పడిన వెంకటాపురం, వీరారెడ్డిపల్లె, మొత్కలపల్లె పంచాయతీల్లో కూడ నూతన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలకు చర్యలు తీసుకుంటుమని చెప్పారు. పంచాయతీల తీర్మాణాలతో నియామకాలకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

కేసు నమోదు

రుద్రవరం: మండలంలోని టీ.లింగదిన్నె, తువ్వపల్లె గ్రామాలకు చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి తువ్వపల్లెలో పల్లకీ వద్ద పూజలు చేయడం, పల్లకీ మోయడంపై ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. మాట మాట పెరిగి ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకొని దాడికి పాల్పడ్డారు. దీంతో టీ.లింగదిన్నెకు చెందిన గొడుగు పెద్ద లింగన్న, తువ్వపల్లె యువరాజ్ పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఏడుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

నంద్యాల: ఈ నెల 21, 22 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు నంద్యాల జిల్లాలో పర్యటిస్తారని ప్రెస్ అకాడమీ సెక్రెటరీ బాలగంగాధర తిలక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారని, 3.30 గంటలకు అక్కడ నుంచి మహానంది పుణ్యక్షేత్రానికి చేరుకొని స్వామి అమ్మవార్లను దర్శించుకుంటారని, సాయంత్రం 5 గంటలకు గెస్ట్ హౌస్‌కు చేరుకొని సీనియర్ జర్నలిస్టులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారని పేర్కొన్నారు. 22న ఉదయం 10 గంటలకు ఎస్‌బీఐ కాలనీలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో జర్నలిస్ట్ డిపార్టుమెంట్ కోర్సు, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. జర్నలిజం ప్రాథమిక సూత్రాలు, ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో మీడియా పాత్రపై సెమినార్ నిర్వహిస్తారని వివరించారు.

చేనేతను ఆదరిద్దాం



వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): చేనేత వస్త్రాన్ని ఆదరించి కార్మికులను ఆదుకుందామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. చేనేత, జౌళిశాఖ కర్నూలు, నంద్యాల వారి నిర్వహణలో సోమవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్, మున్సిపల్ కార్యాలయం వద్ద, ఆర్‌ఎస్ రోడ్డులో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను చేనేత, జౌళి శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు రాజారావు, సహాయ సంచాలకులు హరికృష్ణతో కలిసి ప్రారంభించారు. రాజారావు మాట్లాడుతూ ప్రదర్శనలో రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన వివిధ జిల్లాల చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కాటన్, మెర్సిరైజ్, పట్టుటై, డ్రైపట్టు చీరలు, సికో చీరలు రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 25 నుండి 30 చేనేత సహకార సంఘల ఉత్పత్తి దారులు పాల్గొననున్నారని చెప్పారు. ఉత్పత్తి ధరలకే అమ్మకాలు జరుగుతాయన్నారు.

పథకాలపై ప్రజలను చైతన్య పరచండి

- పార్టీ విజయానికి రథసారథులుగా మారాలి
- గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి



సమావేశానికి హాజరైన గృహ సారథులు

నంద్యాల: సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం నింపి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు రథసారథులుగా మారాలని గృహ సారథులకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రథమ నంది ఆవరణలోనున్న వైఎస్సార్ కల్యాణ మండపంలో గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వంపై టీడీపీ లేనిపోని బురద చల్లాలని ప్రత్నిస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం చేసి చూపుతుంటే వేరే దారి లేక తప్పుడు ఆరోపణలకు దిగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చారని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రకు దీటుగా యువగళం పేరుతో లోకేష్ పాదయాత్ర చేయడం చూస్తుంటే.. పులిని చూసి నక్క వాతలు పెట్టుకునే చందంగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వాటిని తెలుసుకోవడానికి జగనన్న పాదయాత్ర చేశారని, ప్రస్తుతం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ప్రజలు సంతోషంగా ఉండటాన్ని తెలుసుకోవాలని సూచించారు. నాడు ప్రజలు జగన్ యాత్రకు నీరాజనాలు పలికారని, నేడు కేవలం బందోబస్తు సిబ్బంది, వాహన సిబ్బంది మినహా నాయకులు కూడా యాత్రలో పాల్గొనక పోవడానికి జనం సంతోషంగా ఉండటమేనన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించి ఓటు బ్యాంక్‌ను పెంచే దిశగా కృషి చేయాలని చెప్పారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశంలో చరిత్ర సృష్టించాయని, వాటి వల్ల ప్రజలకు చేకూరిన మేలును వివరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్‌రెడ్డి, బెస్త సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు



ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో సీనియర్స్ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానంలో, జిల్లెల్లకు చెందిన గటిక నాగిరెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచాయి. పెసరవాయికి చెందిన కలాంబాష వృషభాలు మూడో స్థానంలో, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సందీప్‌రెడ్డి ఎద్దు నాల్గో స్థానంలో, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నారాయణ వృషభాలు ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 70 వేలు, రూ. 50 వేలు, రూ. 30 వేలు, రూ. 25 వేలు, రూ. 15 వేలు నగదును అందజేశారు.

వాల్మీకులకు పెద్దపీట

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇచ్చి పెద్దపీట వేశారని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులికొండన్న పేర్కొన్నారు. ఎమ్మెల్సీ స్థానాలకు కర్నూలు జిల్లా నుంచి డాక్టర్ మధుసూదన్, అనంతపురం నుంచి మంగమ్మ పేర్లు ఖరారు కావడంతో పట్టణంలోని వాల్మీకి విగ్రహం ఎదుట వాల్మీకులు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులను రాజకీయంగా ప్రోత్సహిస్తున్న సీఎంకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, మధుగోపాల్, నారాయణ, పరమేష్, శివశంకర్, జయరాం, బాలు, ఈశ్వరయ్య, సవారి, రమేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పది 'ప్రత్యేకం'





టెక్కే మున్సిపల్ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న దృశ్యం,గుర్రాల పేటలో మున్సిపల్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన చేస్తున్న దృశ్యం

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించేందుకు చర్యలు
- ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా కార్యాచరణ



గుర్రాల పేట మున్సిపల్ హై స్కూల్‌లో ఆరు బయట చదువుతున్న విద్యార్థులు

నంద్యాల(సిటీ): పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉదయం 8 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్ట్ ప్రకారం తరగతులు జరుగుతున్నాయి. సంబంధిత ఉపాధ్యాయుడు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇందులో పూర్తయిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేయించడమే గాకుండా సందేహాలను నివృతి చేస్తున్నారు. ఇక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ఎలా రాయాలో అవగాహన కలిపిస్తున్నారు. ఇక పరీక్షలో ఒత్తిడిని ఎదుర్కొనేందుకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. అలాగే డిజిటల్ రూపంలో బోధన చేస్తూ వారికి త్వరగా అర్థమయ్యేలా చూస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 454 పాఠశాలల నుంచి 25,336 మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రైవేటు ఎయిడెడ్ 12 పాఠశాలలు, ప్రైవేటు అన్ ఎయిడెడ్ 182 పాఠశాలలు ఉండగా మొత్తం 8,686 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలు.. 20 మోడల్ పాఠశాలల్లో 1989, 5 ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 372, 5 ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ 398, 4 ఏపీ టీడబ్ల్యూఆర్‌ఎస్ 129, 16 ప్రభుత్వ పాఠశాలల్లో 1,635, 27 కేజీబీవీల్లో 1,078, 4 మండల పరిషత్ పాఠశాలల్లో 379, 179 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10,670 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 16,650 మంది విద్యార్థులు ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్నారు.